క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే వసంత కార్యక్రమాలు

మైలవరం: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు మైలవరం పాత ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన విజయవాడ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, సీఎమ్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురామ్ పలువురు ఎమ్మెల్యేలు పాల్గొంటారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఆగిరిపల్లి: ప్రభుత్వం నూతనంగా పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచిన పింఛన్ మొత్తాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

10 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

విస్సన్నపేట: మండలంలో గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీల్లో గెలుపొందిన టీంలకు మండల స్థాయి పోటీలు ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ ఆదివారం తెలిపారు. 15 గ్రామ సచివాలయాల పరిధిలో ఐదు క్రీడలపోటీలలో ఎంపికైన టీములకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

జి.కొండూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రజా పరిషత్ సభ్యులతో పాటు ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం మండల నూతన కమిటీ ఎంపిక

విస్సన్నపేట: బీసీ సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.శివశంకర్ ఆధ్వర్యంలో నియమించారు. బీసీ సంక్షేమ సంఘం మండల గౌరవాధ్యక్షుడు బూబత్తుల బాలకొండయ్య, అధ్యక్షుడు లకుం పవన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పలగాని శ్రీరాములు, ఉపాధ్యక్షుడు గోదా శ్రీను, ప్రధాన కార్యదర్శి చేగోరి శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి కాలంగి వీరరాఘవులు, కోశాధికారి కేదాసి గోపాల కృష్ణను నియమించారు.

రేపు హుండీల కానుకల లెక్కింపు

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలోని హుండీల్లో కానుకలను మంగళవారం ఉదయం 10 గంటల నుంచి లెక్కించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు తెలిపారు. గడచిన మూడు నెలలకు సంబంధించిన కానుకలను ఈ విడత లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు 'స్పందన'

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని గడువులోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

కోటపాడులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

చాట్రాయి: మండలంలోని కోటపాడు, చీపురుగూడెం గ్రామాల్లో ఆదివారం అధికారులు వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ మురళీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మచారి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, బీజేపీ నాయకుడు రాజా పాల్గొన్నారు.

వసతి గృహంలో సంక్రాంతి సంబరాలు

రెడ్డిగూడెం: స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డెన్ కట్టా రమాదేవి ఆధ్వర్యంలో సిబ్బంది కొప్పుల హేమలత, అమ్ములు హాస్టల్ ఆవరణలో కనువిందు చేసే ముగ్గులు వేశారు. హాస్టల్ ముఖద్వారాన్ని పచ్చతోరణలతో అలంకరించారు.



నూజివీడు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: అన్ని రంగాల్లో నూజివీడు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని పోతురెడ్డిపల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయం, యునైటెడ్ కార్పెంటర్స్ అసోసియేషన్ కార్యాలయం, కనకదుర్గ నాయీబ్రాహ్మణ సంఘం కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. రూ.26 కోట్లతో పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఆధునిక వసతులతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. విస్సన్నపేట రోడ్డులోని క్రికెట్ గ్రౌండ్‌ను రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డుకు బైపాస్ రహదారి నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్ నూజివీడు వచ్చిన సందర్భంగా డ్రెయిన్ల అభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు చేశారన్నారు. గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఒకొక్క సచివాలయం పరిధిలో ప్రజలకు రూ.15 కోట్ల వరకు లబ్ధి చేకూరిందన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజీ క్లినిక్‌లను నిర్మించి ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. పట్టణంలో రూ.1.60 కోట్లతో రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు శాశ్వత భవనాలను నిర్మించామన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగల గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు యార్లగడ్డ చంటి, కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివ, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సుబ్బారావు, ఏపీ ఎన్జీవో నూజివీడు అధ్యక్షుడు జీ శ్రీనివాసరావు, కౌన్సిలర్ మీర్ అంజాద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న జగనన్న లే అవుట్లల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని బూరుగుగూడెం జగనన్న లే అవుట్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు ఉచితంగా ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు నిర్మించి కాలనీలో తాగునీరు, విద్యుత్ డ్రెయినేజీ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయదారుని పట్టివేత

ముసునూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శివ నాగేంద్రరావు తెలిపారు. వలసపల్లిలో తాళ్లూరి సమూయేలు ఆదివారం సాయంత్రం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి నిర్వహించి అతడిని పట్టుకున్నారు. ఈ దాడిలో రూ.750 విలువైన దారుహౌస్ 180 ఎంఎల్ ఐదు బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ చెప్పారు. అక్రమంగా మద్యం, సారా విక్రయాలు చేస్తే దాడులు జరిపి, కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

కోడిపందేల శిబిరంపై దాడి

చింతలపల్లి (ముసునూరు): కోడిపందేల శిబిరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. చింతలపల్లి శివారు గోగులంపాడు కొత్తూరులో ఆదివారం సాయంత్రం కోడిపందేలపై దాడిచేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, రూ.3,500, రెండు కోడిపుంజులను, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. వీరిని సోమవారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఆయన చెప్పారు.

బోర్ ఏర్పాటు

మైలవరం: మైలవరం బ్రాహ్మణ సంఘం అపరకర్మల నిమిత్తం వైకుంఠధామం వద్ద ఏర్పాటు చేసుకొన్న స్థలములో బోర్ ఏర్పాటు చేసినట్లు బ్రాహ్మణ సంఘం సమన్వయకర్త వీ బాలాజీ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం వేంకటేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు భాష్యం శ్రీనివాసదీక్షితులు సంఘ అభివృద్ధి నిమిత్తం రూ.60వేలు ఖర్చుతో బోర్ వేయించినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకులు



వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులతో షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు జనసేన పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా పార్టీ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సమన్వయకర్త ఆసిఫ్ వారికి కండువా కంపి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ నియోజకవర్గ టీడీపీలోనే అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయన్నారు. జనసేనకు దిశానిర్దేశం లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల అభ్యున్నతికి పాటుపడుతోందని చెప్పారు.

ఈ క్రమంలో జనసేన, ఇతర పార్టీల నాయకులు వైఎస్సార్ సీపీలో భారీగా చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో నగరంలో మూడు స్థానాలు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని చెప్పారు. పశ్చిమంలోని జనసేన పార్టీ నాయకులు పి.యల్లయ్య, ఎస్.శివారెడ్డి, ఎస్.జె.రెడ్డి, కె.నరసింహులు, వై.రమణ, బి.సింహాచలం, ఎస్.రాము, బి.నరసింహా, దూండేశ్వరరావు వారి అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు.

నేడు వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభం

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సోమవారం ఉదయం పర్యటించనున్నారు. కాచవరంలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రంతో పాటు కొటికలపూడిలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, ప్రేమధార రైతు ఉత్పత్తుల పరస్పర సహకార సహాయక సంఘం నూతన కార్యాలయాలను ఆయన ప్రారంభిస్తారు. ప్రజా ప్రతినిధులు, పార్టీలో వివిధ విభాగాలకు చెందిన నాయకులు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొనాలని ఎమ్మెల్యే వసంత కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతలు ఇంటింటికీ పంపిణీ



కిలేశపురంలో అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ చేసిన గ్రామ వికాస్ సభ్యులు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): అయోధ్య రామాలయంలో శ్రీరాముని పాదాల చెంత నుంచి వచ్చిన అక్షింతలు కిలేశపురంలో ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా స్థానిక గంగానమ్మ అమ్మవారి ఆలయంలో గ్రామ వికాస్ భక్త బృందం ఆధ్వర్యంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటికీ అక్షింతలతో పాటు అయోధ్య ఆలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఆహ్వాన పత్రం, శ్రీరాముడి జెండా అందజేశారు. భక్తులు అక్షింతలను స్వామివారి ప్రసాదంగా స్వీకరించారు.

రఘునందన్‌కు పడాల స్మారక పురస్కారం



పడాల పురస్కారం అందుకుంటున్న రఘునందన్

తిరువూరు: తిరువూరు రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్‌కు పడాల రామారావు స్మారక పురస్కారం లభించింది. శనివారం రాత్రి రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తూర్పు గోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘాధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఈ పురస్కారాన్ని రఘునందన్‌కు అందజేశారు. భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత విశేషాలను తెలుగు, హిందీ భాషల్లో రచించడం, పైడిమర్రి పేరుతో పోస్టల్ కవరు, స్టాంపు విడుదల చేయించడంలో రఘునందన్ చేసిన కృషికి ఈ పురస్కారం లభించింది.

చెకుముకి టెస్టులో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



చెకుముకి టాలెంట్ టెస్టులో మూడోస్థానం సాధించిన సిద్ధార్థ విద్యార్థులు

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో ఆదివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో తిరువూరు సిద్ధార్థ స్కూలు విద్యార్థులు మూడో బహుమతి గెలుచుకున్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో తమ పాఠశాల జట్టు బహుమతి సాధించినందుకు కరస్పాండెంటు చక్రపాణి అభినందించారు. విజేతలకు బహుమతులను విజయవాడలో అందజేశారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థినికి ఉపకార వేతనాన్ని అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, సొసైటీ ప్రతినిధులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శ్రీనగరాల ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తుల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 23 ఏళ్లగా సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం సాయం అందించడం అభినందనీయమన్నారు. అనేక మంది విద్యార్థులు సొసైటీ చేసిన సాయంతో ఉన్నత విద్యలను అభ్యసించి దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని చెప్పారు. ప్రొఫెసర్ బాయన శంకర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 77 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు, 96 మందికి వృద్ధాప్య పెన్షన్లుగా మొత్తం రూ.3.63 లక్షలను అందించారు. కార్యక్రమంలో బాయన వెంకట్రావు, సొసైటీ అధ్యక్షుడు లింగిపిల్లి రామకృష్ణ, కార్యదర్శి పిళ్లా రవి, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు పిళ్లా మోహన్, బెవర సూర్యనారాయణ, పిళ్లా శ్రీనివాసరావు, రాంపిళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల కోశాధికారిగా వెంకటేశ్వరరావు



ఇబ్రహీంపట్నం: దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలో ఇబ్రహీంపట్నానికి చెందిన దస్తావేజు లేఖరి కొమ్మూరి వెంకటేశ్వరరావు రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కోశాధికారిగా ఎన్నికైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వృత్తిలో భాగంగా తనకు కేటాయించిన కోశాధికారి పదవికి తనవంతు న్యాయం చేస్తానన్నారు. తన ఎంపికకు కృషిచేసిన తోటి దస్తావేజు లేఖరులకు ధన్యవాదాలు తెలిపారు.

అమ్మా.. మనసాస్మరామి







ఇంద్రకీలాద్రిపై ఐదు రోజులుగా జరుగుతున్న భవానీ దీక్ష విరమణలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భవానీలు తరలివచ్చారు. గిరి ప్రదక్షిణ నిర్వహించి, అమ్మ వారిని దర్శించుకున్న అనంతరం ఇరుముడులను సమర్పించారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య చెప్పారు. సిప్ అబాకస్ ఇండియా ఆధ్వర్యంలో సిప్ అర్థమెటిక్ జీనియస్ కాంటెస్ట్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగాయి. వివిధ జిల్లాల్లోని పలు పాఠశాలలకు చెందిన 700 మందికిపైగా విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని సీతారామయ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవజీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.అరుణారెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు వారిలోని ప్రతిభకు మరింత పదును పెట్టుకునేందుకు అవకాశం లభిస్తోందన్నారు. సిప్ అబాకస్ సంస్థ స్టేట్ హెడ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ఈ నెల 28న చెన్నైలో జాతీయ స్థాయిలో జరిగే పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆదివారం నిర్వహించిన పోటీల విజేతలకు అతిథులు బహుమతితో పాటు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



గాయనీ గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హైదరాబాద్‌కు చెందిన సరస్వతీ కళాపీఠం వ్యవస్థాపకురాలు మధిర రోజా ప్రసన్నత సూచించారు. నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకల సందర్భంగా సరస్వతి కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర రోజా ప్రసన్నత మాట్లాడుతూ గాయనీ గాయకులు నిత్యం పాటలోని సాహిత్యం అధ్యయనం చేయాలని సూచించారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ సరస్వతీ కళాపీఠం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విలువలతోకూడిన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ప్రతిభను గుర్తిస్తూ నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తునట్లు తెలిపారు. పీసుపాటి సుబ్రహ్మమణ్యశాస్త్రి, కొప్పరపు ఉమాబలరాం, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి తదితరులు శాస్త్రీయ, క్లాసికల్ గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులు కాటూరి దుర్గాప్రసాద్, దేవికృష్ణ, చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, చిత్రకారుడు మల్లిక్‌తోపాటు గాయనీ గాయకులను, వాద్య సహకారం అందించిన వారిని ఆత్మీయంగా సత్కరించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



భవానీపురం(విజయవాడ పశ్చిమ): అనారోగ్యంతో మరణించిన పేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం భరోసా ఇస్తోందని 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా పేర్కొన్నారు. విద్యాధరపురం రావిచెట్టు సెంటర్‌లో నివసించే షేక్ యూనస్ మరణించారు. వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10 వేల నగదును మృతుడి భార్య షేక్ కౌసర్‌కు కార్పొరేటర్ రెహమతున్నీసా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తోందన్నారు. నిరుపేద కుటుంబంలోని వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చులకు నగదు అందజేసి ఆదుకుంటుందని తెలిపారు. వైఎస్సార్ బీమా పథకం కింద వచ్చే మొత్తంలో మిగిలిన డబ్బు నామినీ బ్యాంక్ ఖాతాలో త్వరలో జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, రవూఫ్, 194 సచివాలయం అడ్మిన్ లక్ష్మణ్, వెల్ఫేర్ సెక్రటరీ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.